క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి

సామర్లకోట: దివంగత సీఎం, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలో నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి సేపెని సురేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సోమవారం ఉదయం జగనన్న కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి రాజీవ్ గృహకల్ప, ప్రసన్నాంజనేయనగర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఉన్న విగ్రహాలకు నివాళులర్పిస్తారని తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుల సమావేశం

సామర్లకోట: రెండు మున్సిపాలిటీలు, మండలాలకు చెందిన బీజేపీ మండల అధ్యక్షుల సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక సంపెంగతోటలో జరిగింది. పార్టీ పెద్దాపురం నియోజకవర్గ సభత్వాల నమోదు ఇన్‌చార్జి గొరకపూడి చిన్నయ్యదొర పాల్గొన్నారు. ప్రతి ఆరేళ్లకోసారి పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

‘కోట’ నృత్య కళాకారిణికి మెడల్



అవార్డు పొందిన కోడూరి సత్య చరిష్య

సామర్లకోట: కూచిపూడి నృత్య కళాకారిణి కోడూరి సత్య చరిష్య వరల్డ్ రికార్డు హోల్డర్ మెడల్ సాధించింది. ఇంటర్నేషనల్ కర్ణాటక్ మ్యూజీషియన్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారణాశిలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో సామర్లకోటకు చెందిన కోడూరి సత్య చరిష్య పాల్గొంది. రావణాకృత శివతాండవం ప్రదర్శించి మెడల్ సాధించినట్టు ఆమె తల్లిదండ్రులు రాణి, శివప్రసాద్ ఆదివారం రాత్రి ఇక్కడ తెలిపారు. నృత్య కళాకారిణి సత్య చరిష్యను ఎమ్మెల్యే రాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అభినందించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా రాజశేఖర్



సామర్లకోట: మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా జవహర్ రాజశేఖర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండేళ్ల క్రితం రాజశేఖర్ ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. సాధారణ బదిలీల్లో ఆయన భీమవరం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల బదిలీల్లో భాగంగా ఆయనను సామర్లకోట శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించాలని ఎమ్మెల్యే చినరాజప్ప సిఫార్సు చేశారు. దీంతో రాజశేఖర్‌ను సామర్లకోట మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

హాస్టల్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ వెంకటలక్ష్మి



పెద్దాపురం బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

పెద్దాపురం: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి అన్నారు. తుపాను, వర్షాల నేపథ్యంలో ఆదివారం పట్టణంలో ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతిగృహాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ వ్యాధుల నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహాధికారులు మరింత అప్రమత్తంగా ఉంటూ, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఆదేశించారు. అనంతరం వసతిగృహాల్లో అమలువుతున్న వసతులపై విద్యార్థులను ఆరాతీశారు. ఆమె వెంట డీటీ కాంతారావు, ఆయా వసతిగృహాల సంక్షేమాధికారులు ఉన్నారు.

రక్తదాన శిబిరం

కొత్తపల్లి: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ గుప్తా జయంతి సందర్భంగా గొల్లప్రోలులో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కాకినాడ రోటరీ క్లబ్ డాక్టర్ కామరాజు పర్యవేక్షించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని రీజియన్ చైర్మన్ కంతేటి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సహాయ కార్యదర్శి కుసుమంచి పాపారావు, గ్రంధి లచ్చన్న, దంగేటి రామకృష్ణ, వాసవీ క్లబ్ మండల అధ్యక్షుడు కేదారిశెట్టి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టితోనే మనుగడ

- వినాయక చవితికి భారీగా సన్నాహాలు
- విగ్రహాల తయారీలో నిర్వాహకులు
- మట్టి విగ్రహాలే మేలంటున్న మేధావులు
- ఇవేమీ పట్టించుకోకుండా జోరుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతి విగ్రహాలు

సామర్లకోట: వినాయక చవితి వస్తుందంటే వ్యాపార, పారిశ్రామికవేత్తలు వారి పరిశ్రమల్లో, షాపుల్లో భారీ ఏర్పాట్లు చేసుకుంటారు. చవితి రోజున వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేసి, పూజలు చేయడం ఆనవాయితీ. గణపతి ఆలయాలతో పాటు, అన్ని ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సంస్థల్లో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలోనే విగ్రహాల తయారీలో ఆయా వ్యాపారులు బిజీగా ఉన్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ కుటుంబం ఐదు తూముల పాత వంతెన వద్ద శిబిరాలు ఏర్పాటు చేసుకుని, పుష్కర కాలం నుంచి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు ఉందనే వాదనలు ఎక్కువగా ఉన్నాయి. అడుగు నుంచి పది అడుగుల వరకు విగ్రహాలను ఇక్కడ తయారు చేస్తున్నారు. రకరకాల రూపాలతో విగ్రహాలను తయారు చేస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు.

మట్టి విగ్రహాలే మేలు

గణపతి నవరాత్రులు పూర్తయ్యాక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి, గోదావరి కాలువ, ఏలేరు కాలువ, సముద్రంలో కలుపుతారు. నీటిలో విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో మట్టి విగ్రహాలైతే నీటిలో కరిగిపోతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసి, పూజలు చేసుకోవాలని అధికారులు, మేధావులు అవగాహన కల్పిస్తున్నారు. దాంతో మట్టి విగ్రహాలను తయారు చేయడంలో కుమ్మరి వృత్తికి చెందిన వారు బిజీగా ఉన్నారు. ఏ శుభకార్యం జరిగినా ముందుగా గణపతి పూజ చేయడం సర్వసాధారణం. వినాయక చవితి రోజున నవ రాత్రులుగా తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు చేయడంతో మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఈ మేరకు ఆయా కూడళ్లలో, యూనియన్ కార్యాలయాల వద్ద గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసి, నవరాత్రులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



గణపతి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న కుటుంబ సభ్యులు

నాలుగు అంగుళాల నుంచి..



గత రెండు దశాబ్దాలుగా గణపతి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయడానికి అనేక మంది అర్డర్లు ఇస్తున్నారు. దాంతో నాలుగు అంగుళాల నుంచి నాలుగు అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తాం. రూ.10 నుంచి రూ.10 వేల వరకు ధర ఉంటుంది. జి.రాగంపేట చెరువులో మట్టితో విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– కర్రి అప్పలరాజు, మట్టి విగ్రహాల తయారీదారుడు, సామర్లకోట

పర్యావరణాన్ని పరిరక్షించాలి



గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం గత పదేళ్లుగా శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి విగ్రహాలను సామర్లకోటలో పంపిణీ చేస్తున్నాం.

– తోటకూర గంగాధర్, పర్యావరణ పరిరక్షణ జాతీయ అవార్డు గ్రహీత, సామర్లకోట

మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలి



వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. ఈ మేరకు పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేస్తున్నాం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారు చేసే వారిపై నిషేధ ఉత్తర్వులు జారీ చేస్తాం. భావితరాలకు స్వచ్ఛమైన తాగునీరు, పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

– కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



రామలింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



పుష్పాలంకరణలో ఉన్న స్వామివారు

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన ఆగమ పండితులు గణపతి శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పారాయణం, సూర్య నమస్కారాలు, రుద్రహోమం, రామలింగేశ్వరస్వామికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తుడు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఎడతెరిపి లేని వర్షం



రవీంద్రపురంలో జలమయమైన రోడ్డు



కొమరగిరి శివారు నాగంపేటలో ముంపునకు గురైన వరి పొలాలు

- జన జీవనం అస్తవ్యస్తం
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు, పంటలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జన జీవనం అస్తవ్యస్తమైంది. ఆక్రమణలకు గురైన కాలువలు పూడుకుపోవడంతో ముంపునీరు పోయేందుకు దారిలేక లోతట్టు ప్రాంతాలు,, పొలాలు నీట మునిగాయి. పలు ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఉప్పాడ–కొత్తపల్లి రోడ్డులో ఉన్న ప్రధాన పంట కాలువ ఎక్కడికక్కడ ఆక్రమణకు గురైంది. దీంతో ముంపు నీరు రవీంద్రపురంలో చేరింది. వీధుల్లో మోకాల్లోతు నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొమరగిరి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి శివారులో ఉన్న పొలాలు ముంపునకు గురయ్యాయి.

ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన కమిషనర్

సాక్షి ఇంపాక్ట్



సామర్లకోట ఫిల్టర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న ఫిల్టర్ బెడ్‌ను మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ‘సాక్షి’లో ‘తాగునీటి కుళాయిల నుంచి బురద నీరు’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఫిల్టర్ చెరువు నుంచి ఫిల్టర్ బెడ్‌లోకి వస్తున్న నీటిని ఆమె పరిశీలించారు. క్లారిఫార్కులేటర్‌లో నీటి శుద్ధి విధానం, ఫిల్టర్ బెడ్‌లో ఆలం, క్లోరిన్‌తో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని ఆమె క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఫిల్టర్ ప్లాంటులో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జి గిడుతూరి శ్రీనివాసరావు ఆమెకు వివరించారు. ఫిల్టర్ బెడ్‌లో నీరు శుద్ధి అయిన తరువాత పైపులైన్ల ద్వారా ట్యాంకులకు సరఫరా అయ్యే నీటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నీటిని శుద్ధి చేసే సమయంలో తగిన మోతాదులో ఆలం, క్లోరిన్ కలపాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అదేవిధంగా తాగునీటి పైపులైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించి, లీకులను గమనించాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. తాగునీటి సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రపంచ శాంతికి నిలబడదాం



పెద్దాపురంలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దాపురం: అమెరికా నాటో దేశాలు ఉసిగొలిపే యుద్ధాలను వ్యతిరేకించి, ప్రపంచ శాంతికి కార్మిక వర్గం నిలబడాలని సీఐటీయూ పెద్దాపురం మండల కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక మెయిన్ రోడ్డు వినాయక గుడి సెంటర్‌లో యుద్ధం వ్యతిరేకించాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలను ఉసిగొలిపే పనిలో అమెరికా నాటో కూటములున్నాయన్నారు. దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, ఒక దేశాన్ని మరొక దేశం పైకి రెచ్చగొట్టే పని అమెరికా సామ్రాజ్యవాదులు చేస్తున్నారని దుయ్యబట్టారు. యుద్ధం ఎక్కడా జరిగినా నష్టపోయేది కార్మిక వర్గమేనన్నారు. పాలస్తీనాపై యుద్ధం చేసి దాదాపు 40 వేల మంది చిన్నపిల్లలు, మహిళలు చనిపోవడానికి ఇజ్రాయిల్ కారణమైందన్నారు. యుద్ధం వద్దు, ప్రపంచ శాంతి కావాలని కార్మిక వర్గం నినాదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ, చింతల సత్యనారాయణ, సావిత్రి, ఆదిరెడ్డి శ్రీను, కరణం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పసర పండగ



ప్రత్యేకాలంకరణలో ఉన్న నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి పసర పండగ వేడుక ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే ఆనవాయితీ ప్రకారం వరినాట్లు పూర్తయ్యాక రైతులు వారి శ్లలో నూకాలమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి, అమ్మవారిని దర్శించుకుంటారు. పసర పండగ నేపథ్యంలో అమ్మవారిని ప్రత్యేకాలంకరణ చేయగా, ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రైల్వే స్టేషన్‌లో హెల్ప్ డెస్క్



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని, మరి కొన్ని రైళ్లు రద్దు చేసినట్టు సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆదివారం ఇక్కడ విలేకర్లకు తెలిపారు. విజయవాడలో భారీ వరద దృష్ట్యా రైళ్ల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు సమాచారం తెలియజేయడానికి స్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రైళ్లలో ప్రయాణం చేస్తున్న వారి బంధువుల వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించామన్నారు. కాకినాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన గౌతమి ఎక్స్‌ప్రెస్ రద్దయిందని తెలిపారు. అదేవిధంగా సామర్లకోట స్టేషన్ మీదుగా విజయవాడ వైపు వెళ్లే గోదావరి, గరీబ్‌రథ్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లను కూడా రద్దు చేశారన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ

జమాతే ఇస్లామి హింద్ మహిళా అధ్యక్షురాలు సిద్దిఖా

కాకినాడ సిటీ: నైతికత కలిగి ఉండి, విలువలతో జీవించడమే స్వేచ్ఛకు నిజమైన అర్థమని జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం అధ్యక్షురాలు సిద్దిఖా అన్నారు. నైతికతే నిజమైన స్వేచ్ఛ పేరుతో జాతీయ వ్యాప్త ఉద్యమం జమాతే ఇస్లామీ మహిళా విభాగం ప్రారంభించిందన్నారు. ఆదివారం సాయంత్రం అల్ ఫలాహ్ మసీదులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనుదినం కానవస్తున్న భయంకర సామాజిక నేరాలు అరికట్టాలంటే నైతిక విలువలు వైపునకు అందరూ మరలాలని పిలుపునిచ్చారు. నా శరీరం నా ఇష్టం అనే భావనను యువతీ యువకులు వదులుకోవాలని కోరారు. మద్యం, డ్రగ్స్ సమస్త మత్తు పానీయాల బానిసత్వం నుంచి బయటపడాలని హితవు పలికారు. స్త్రీ, పురుషుల సమానత్వపు మోసపూరిత నినాదాల పేరుతో మహిళలను, వారి శరీరాలను మార్కెట్ వస్తువుగా అమ్మకానికి పెట్టిన పెట్టుబడిదారీ వ్యవస్థ, సంపన్నుల కుట్రలను నైతికతతో భగ్నం చేయాలన్నారు.

ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్సై వీఆర్ మూర్తి



సామరకోట: పట్టణ, మండల పరిధిలో గణపతి నవరాత్రి మందిరాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సామర్లకోట ఎస్సై వీఆర్ మూర్తి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఉత్సవాలకు తీసుకోవాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఆయా మందిరాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ఆధార్ కార్డుల జెరాక్సులతో పాటు, ఫోన్ నంబర్లు, చిరునామాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. నవరాత్రి ఉత్సవాలు ఎన్ని రోజులు ఏర్పాటు చేస్తారో, ఆయా మందిరాలకు చెందిన నిర్వాహకులు పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. అదేవిధంగా నిమజ్జనం తేదీని కూడా ముందుగా తెలియజేయాలని స్పష్టం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎవరూ మద్యం సేవించరాదని చెప్పారు. నిమజ్జనాన్ని రాత్రి 11 గంటల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలనే వాడాలన్నారు. తాము సూచించిన ప్రదేశంలో మాత్రమే గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి ఉంటుందని చెప్పారు.

ట్రెండ్ మారుతోంది

- కస్టమైజ్ గిఫ్టులకు పెరుగుతున్న ఆదరణ
- అందుబాటు ధరల్లో బహుమతులు
- క్రమంగా పెరుగుతున్న వ్యాపారం





మార్కెట్‌లో అందుబాటులో ఉన్న కస్టమైజ్ గిఫ్టులు

బోట్‌క్లబ్: గతంలో బహుమతులు ఇవ్వాల్సి వస్తే, ఇంటిలో అలంకరణ వస్తువులు ఇచ్చేవారు. దేవుడు బొమ్మలు, గోడ గడియారాలు, సీనరీలు వంటివి ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. వారి ఫొటోలను వారికే బహుమతులుగా ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కస్టమైజ్ గిఫ్ట్‌లకు మంచి గిరాకీ వచ్చింది. ఎవరికైతే బహుమతి ఇవ్వాలనుకుంటున్నారో, వారి బొమ్మలతో కూడిన బహుమతులివ్వడం మొదలైంది.

కస్టమైజ్ గిఫ్టుల్లో వివిధ రకాలు అందుబాటులోకి వచ్చాయి. తలగడ దిండుపై, టీకప్పుపై, గోడపై అలంకరించే రకరకాల డిజైన్లలో కస్టమైజ్ గిఫ్టులు ఉండడంతో, వీటిని బంధువులు, స్నేహితులకు ఇచ్చేందుకు పోటీ పడుతున్నారు. ఫొటోలు కూడా సేకరించడం పెద్దగా ఇబ్బంది ఉండడం లేదు. ప్రస్తుతం ఏ ఫంక్షన్‌లోనైనా తీసుకున్న ఫొటోలు వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో బంధువులకు షేర్ చేస్తున్నారు. వాటిని భద్రపరిచి, వారింట్లో పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి శుభకార్యాలకు.. వారి ఫొటోలనే అందంగా తయారుచేసి బహుమతిగా ఇస్తున్నారు. ఇలాంటివి జనాలకు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. దీంతో కాకినాడ నగరంలో ఈ కస్టమైజ్ గిఫ్టుల షాపులకు గిరాకీ పెరిగింది. గతంలో కాకినాడలో వేళ్లపై లెక్కపెట్టేలా ఇలాంటి షాపులుండేవి. ప్రస్తుతం వీటికి మంచి గిరాకీ రావడంతో, అనేక షాపులు వెలిశాయి. ప్రస్తుతం వీరికి చేతినిండా పని కూడా ఉంటోంది.

కంప్యూటర్ ప్రింటింగ్ విధానంతో..

ఎదుటి వారికిచ్చే బహుమతులు వారి ఫొటో నాణ్యత తగ్గకుండా కంప్యూటర్‌పై ప్రింటింగ్ చేస్తున్నారు. రకరకాల స్టైల్స్‌లో కస్టమైజ్ గిఫ్టులు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. గోడకు తగిలించే బొమ్మలతో పాటు, కార్లలో పెట్టే దిండ్లు ఇలా రకారకాల డిజైన్లలో కస్టమైజ్ గిఫ్టులను కంప్యూటర్ ద్వారా ప్రింట్ వేసి ఇస్తున్నారు.

రెండేళ్ల క్రితం నష్టాలతో..

కాకినాడ నగరంలో రెండేళ్ల క్రితం వివిధ ప్రాంతాల్లో కస్టమైజ్ గిఫ్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. అప్పట్లో అంతగా వ్యాపారం జరగక వ్యాపారులు డీలా పడ్డారు. వినియోగదారుల్లోను అంతగా క్రేజ్ లేకపోవడంతో, షాపు యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఈ క్రేజ్ అంబరాన్ని తాకడంతో, ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. దూర ప్రాంతాల్లో ఉన్నా.. ఈ బహుమతులు చేరవేసేలా ఆన్‌లైన్ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. సొమ్ము సైతం ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు రావడంతో, అంతా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని, వారి బంధువుల చెంతకు చేరవేసే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

వ్యాపారం చాలా బాగుంది



రెండేళ్లగా అసలు బేరాలు ఉండేవి కాదు. సిబ్బందికి, షాపు అద్దెలు చెల్లించేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం కస్టమైజ్ గిఫ్టులు తమ బంధువులు, స్నేహితులకు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బేరాలు బాగా వస్తున్నాయి. ఆన్‌లైన్‌లోను వారికి కావాల్సిన గిఫ్టులు పంపే ఏర్పాట్లు చేస్తున్నాం.

– సాయి, కస్టమైజ్ గిఫ్ట్ షాపు నిర్వాహకుడు

అందుబాటు ధరల్లో..



ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన కస్టమైజ్ గిఫ్టులు బంధువులకు, స్నేహితులకు ఇచ్చేందుకు ఎంతో బాగుంటున్నాయి. ఇచ్చే బహుమతిని చూసి వారు చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటు రేటులో కూడా కస్టమైజ్ గిఫ్టులు అందుబాటులో ఉన్నాయి.

– అంకంరెడ్డి రామునాయుడు, కొనుగోలుదారుడు